# అమ్మా... నేవెళ్ళనే

ఉరిటి సులేఖ



**'అమ్మాయికి ఈ సంబంధం అయినా ఖాయం అయ్యేట్టు చూడు తల్లీ" మనసారా మొక్కుకుంది వర్దని.**

"అమ్మాయిగోరికి ఈ సమ్మందం కూడా తప్పిపోట్టు సూడు తల్లీ" చెంపలు వాయించుకుంటూ ఎవరికి వినిపిస్తుందో తన మొక్కు అన్న భయంతో మనసులోనే గొణుక్కుంటూ చక్రాల్లాంటికళ్లను గబగబ అటుఇటూ తిప్పుతూ పూలసజ్జను చేతిలోకి తీస్కుంటున్న పనిపిల్లనుద్దేశించి "దుర్గీ త్వరగా రా" అంది వర్దని కారు వైపు నడుస్తూ.

అప్పటికది పదో సంబంధం. వర్దని మొక్కు లోలోపమోదుర్గమొక్కులో మహత్యమో కానీ సుప్రియకి వచ్చిన పదిసంబంధాల వాళ్లూ పరార య్యారు. జాతకాలు కలవలేదనో, పిల్లనచ్చలేదనో, వీళ్లకి నచ్చక కొన్ని, వాళ్లిష్టపడక కొన్ని మొత్తానికి ఏవీ కుదరలేదు. అమ్మాయికి ఏదో దోషం ఉంది. పూజలు చేయించమని కొంతమంది ఉచిత సలహాలు కూడా ఇచ్చారు.

"సుప్రియా, త్వరగా తెములు. ఇప్పుడే బ్యూటీపార్లర్‌కు ఫోన్ చేసి అప్పాయింట్‌మెంట్ తీస్కున్నాను. " పావుగంటలో సుప్రియ తయారయింది.

"ఒసేయ్ దుర్గీ, అమ్మాయికి తోడుగా వెళ్లు. వంటగదినుండే అరిచింది వర్దని. ఒక గంటలో రూపంతా మారి అందంగా కన్పిస్తోన్న సుప్రియను చూసి గుండ్రటి కళ్లను ఆశ్చర్యంగా ఓ మారి ఆర్పి తెరిచింది దుర్గి. "అమ్మో అమ్మాయి గోర్ని సూత్తంటే నాకే మతిపోతంది. కొంపదీసి యీ సంబంధం గాని కుదిరిపోద్దా ఏం? అమ్మో అలా

జరక్కూడదు. పోలేరమ్మ తల్లీ ఈ సారి జాతరకి గటం నేనే మోత్తాను. అమ్మాయిగోరికి యీ సమ్మందం అవ్వకుండా సూడమ్మా! ముత్తేలమ్మ తల్లీ నీకు బోగం ఎడతాను. అమ్మాయిగోరికి ఈ సమ్మందం కుదరకుండా సూడమ్మా! ''

"ఏంటి దుర్గీ , అలా చూస్తున్నావ్? నేను బాగున్నానా?'' అడిగింది సుప్రియ.

"సానా బాగున్నారమ్మా'' తేరుకుంటూ అంది దుర్గి.

"పదవెళ్దాం'' ఇంకోసారి అద్దంలో చూస్కుని బయటకు నడిచిన సుప్రియను అనుసరించింది దుర్గి.

సుప్రియకు పెళ్లిచూపులయ్యాయి. వాళ్లు ఇంటికి వెళ్లి కబురు పంపుతామన్నారు.

00 00 00

ఆ రాత్రి ఎప్పట్లాగానే తాగి వచ్చిన తండ్రి - భార్యని చచ్చిపోయేట్టు తన్ని పెళ్లాం పిల్లలకు ఒక్క మెతుకు క్కూడా మిగల్చకుండా అంతా తినేసి, అరుగు మీద హాయిగా నిద్రపోయాడు.

ఏడుస్తోన్న తల్లి మెడచుట్టూ చేతులేసి "అమ్మా ఆకలేస్తోందే'' ఎండిన డొక్కను చూస్కుంటూ దీనంగా అంది దుర్గి.

"అమ్మాయిగారి పెళ్లి కుదరాల, మన కష్టాలు గట్టెక్కాల. ముత్తేలమ్మ తల్లీ ... ఈ సమ్మందమేన ఆ అమ్మాయిగోరికి కుదిరేట్టు సూడుతల్లీ'' ఎండిన రొమ్ముల్ని ఆబగా చీకుతోన్న ఆఖరి కూతుర్ని అక్కున చేర్చుకుంటూ రెండు చేతులెత్తి ఆకాశం వంక చూసి మొక్కుకుంది రాములమ్మ.

రాములమ్మకు ముగ్గురూ కూతుళ్లే! పెద్దది పదేళ్ల దుర్గి. రెండోది రెండిళ్లల్లో పాచిపన్లు చేస్తుంది. అది దుర్గ కన్నా ఏడాది చిన్న. మూడో దాన్నెత్తుకుని పూలమాలలల్లుతుంది రాములమ్మ. అల్లిన మాలల్ని సముద్రపు టొడ్డున అమ్మి, వచ్చిందంతా తాగేసి, పెళ్లాన్ని తన్నటాన్కి ఇంటికి చేరతాడు ఆమె భర్త.

జరిగిన పెళ్లిచూపుల్ని తలచుకుంటూ బాల్కనీలో నడుస్తోన్న సుప్రియ తల్లిని పట్టుకుని ఏడుస్తోన్న దుర్గిని చూసి ఓ గిన్నెలో అన్నం పెట్టి దుర్గిని పిల్చి ఇచ్చింది.

"మా తల్లి బంగారం. ఆ దేవుడు నిన్ను చల్లగా సూడాలమ్మా. ఈ సమ్మందం నీకు తప్పక అయి పోద్దమ్మా!'' ఈ సారి దుర్గి కూడా తల్లిలానే మనస్పూర్తిగా కోరుకుంది.

దుర్గి కోరక కోరక కోరిన కోర్కె అవ్వటం వల్లేమో దేవుడు వెంటనే ఆ పిల్ల కోర్కె తీర్చేశాడు.

00 00 00

మర్నాటి మధ్యాహ్నం అరుగుతుడుస్తోంది దుర్గి.

" అమ్మగారూ! ఓపాలి ఇలా రాండి''

"ఎందుకే''

"అబ్బా ఓపాలి ఇలారాండమ్మా''

"ఏంటే చెప్పు? అక్కడ పనాపుకుని వచ్చాను'

"ఇక్కడ సూడండమ్మా! ఈ సీవఁలు ఎన్నున్నాయో!''

"అబ్బా దానికే నన్నుపిలవాలా? వెళ్లి ఆ చీమల మందు తీస్కొచ్చి వెయ్యి. అవే పోతాయి.'' అంటూ రింగవుతోన్న ఫోన్ వైపు నడిచింది వర్దని .

"సీఁవలెలా పరిగెడుతున్నాయో?'' పడి పడి నవ్వసాగింది దుర్గి. మందు వెయ్యడం పొట్టపట్టుకు నవ్వడం వంగుతూ హాయిగా నవ్వుతోన్న పిల్ల, వర్దని మాట వింటంతో వెంటనే ఆగిపోయింది.

"సుప్రియా, వాళ్లకి నువ్వు నచ్చావుట. ఇంక ముహూర్తాలుపెట్టుకోవడమే''కూతురి భుజాలు పట్టుకుని సంతోషంగా అరిచింది వర్దని.

మందు వాసన సోకడంతో చెల్లాచెదురైన చీమల్లా దుర్గి మనసు పరిపరి విధాల పోతుంది. అమ్మాయిగారికి పెళ్లి కుదిరింది. ముందురాత్రి పొరబాట్న తను కోరిన కోరికను దేవుడు తీర్చేశాడు. ఇప్పుడెలా?''

"ఒసేవ్ దుర్గీ, ఏంటాలోచిస్తున్నావ్! ముందీ లడ్డు తిను . రాములమ్మా! అమ్మాయికి పెళ్లి కుదిరింది. బాగానే డబ్బున్నాళ్లు. పెళ్లవ్వంగానే అమ్మాయి అబ్బాయితో వెళ్లిపోవచ్చు. అత్తామామా పెద్దకొడుకుతో పాటు ఆ పల్లెటూళ్లోనే ఉంటారుట.'' ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతోంది వర్దని.

"నానంటానే ఉన్నాను కదమ్మా. అమ్మసక్కని సుక్క. మంచి గునం. దేవుడు తప్పక సల్లగ సూస్తాడు'' వర్దని ఇచ్చిఏన స్వీటు తింటూ అంది రాములమ్మ.

ఆరోజంతా దుర్గి మనసు బాగలేదు. ఆరోజే కాదు, సుప్రియ పెళ్లయ్యేంత వరకు దుర్గి అలా అన్యమనస్కంగానే ఉండిపోయింది.

"ఒసేయ్ దుర్గీ, నీ పంట పండిందే. అమ్మాయి గారి పట్టుఅలంగాలన్నీ నీకే! పాత బట్టలన్నీ నీకే! అమ్మగారు మనకి మంచి బట్టలు తెత్తాన్నారు. పెళ్లికి ముందు మూడ్రోజులనుంచి మనం పొయ్యి రాజేయనక్కరలేదు. పెళ్లికి కావల్సిన పువ్వులన్నీ మనవే యివ్వాల. "ఏఁవయ్యో, రేపటి నుండి దండలు నువ్వా బీచికాడ అమ్మనక్కర్లేదు. ఇయ్యన్నీ అమ్మాయి గారింటి కి ఎళ్లాల్సిందే. అమ్మగారు మన కష్టాన్నేం ఉంచుకోర్లే!'' ఏ పని చేస్తోన్నా రాములమ్మకి పెళ్లి మాటలే! అసలు పెళ్లి హడావుడి అంతా ఆమెలోనే కన్పిస్తోంది.

"ఊళ్లో పెళ్లికి కుక్కల సందడంట. అలా ఉంది ఈమె యవ్వారం'' కోపంగా గొణుక్కుంది దుర్గి.

"ఏంటే దుర్గీ, అలా నుంచున్నావు? ఎళ్లు, ఎళ్లి మొకం కడుక్కోని ముత్తాబవ్వు. అమ్మగారు సూత్తే తిడతారు. బేగిరా. అమ్మాయిగారితో కలిసి పోటోవు దిగాల''

ముక్తసరిగా లేచి పెళ్లిపనుల్లో పాలు పంచుకుంది దుర్గి. పెళ్లి హడావుడి పూర్తయ్యి చుట్టాలంతా వెళ్లిపోయారు. పెళ్లికొడుకుతోపాటు ఓ ఇద్దరు ముత్తయిదువులు మాత్రం మిగిలారు.

ఆమర్నాడే సుప్రియ అత్తారింటికి ప్రయా



## పొగ...

**టీ**చర్: (ఆరోగ్యసూత్రాలు చెబుతూ) "బీడీ, సిగరెట్, చుట్టా...ఇలాటివి తాగితే ఏంవస్తుందో తెలుసా?"

శేఖర్: "తెలుసు, సార్...పొగ వస్తుంది!"

- **చందూ వంశీ**, నంద్యాల

ణం. పెళ్లికొడుకు స్నేహితుల్ని కలవాలని బయటకు వెళ్లాడు. సామాన్లు సర్దుతోన్న వర్ధని ఆగి ఆగి కొంగుతో కళ్లు తుడుచుకుంటోంది. ఆడుతూ పాడుతూ ఇంట్లో తిరిగే పిల్ల ఇప్పుడిక చుట్టపు చూపుకే కరువైపోతుంది. ఓ వైపు ఆనందం, మరోవైపు దుఃఖం.

బాల్కనీలో కూర్చుని వెన్నెల్ని చూస్తూ ఆలోచిస్తోంది సుప్రియ. పెరట్లో జాంచెట్టు, నందివర్ధనంచెట్టు పక్కన ఉయ్యాలా, గాలికి ఊగుతున్న పందిరిమల్లెలు, దొంగతనంగా కోసుకు వచ్చి గోడ పక్కన తనూ , తమ్ముడు కొట్టుకుంటూ పంచుకుని తినే సీమ చింతకాయలు, తనకు పని చేతకాదని అమ్మ విసుక్కోవడం, చదూకుంటున్న పిల్లకి పని చెప్పొద్దని నాన్న వెనకేసుకు రావటం, అమ్మకి తెలీకుండా రాములమ్మ చేత నువ్వుజీళ్ల తెప్పించుకు తినడం, మొగుడు కొట్టాడని ఏడ్చే రాములమ్మకి తను దాచుకున్న డబ్బులివ్వడం, తనిచ్చిన పాతబట్టల్ని మురిపెంగ వేసుకునే దుర్గి, తన కోసం ప్రత్యేకంగా పూలమాలలల్లే రాములమ్మ భర్త , ఒక్కొక్కరుగా అందరూ ఆమె ముందు! గుండె బరువెక్కింది అమ్మా ....నే వెళ్లనే .. అమ్మమెడ చుట్టూ చేతులు వేసి నడుం మీద కాళ్లు వేసి హాయిగా న్నిదపోవాలని! అమ్మా నేనెక్కడికీ వెళ్లనే! అని మారం చేసి చెప్పాలని... కానీ కుదరదు. ఎప్పటికీ శాశ్వతంగా కుదరదు. భారమైన మనసుతో కిందకి చూసింది సుప్రియ.

ఆకు పచ్చటి కొత్త ట్రంకుపెట్టెలో దుర్గి బట్టలు సర్దుతోంది రాములమ్మ. అవన్నీ తనవే. పాతవి. మెరుపు తగ్గినవి. అన్నింటి కన్నా పైన పెళ్లికి తీసిన కొత్తబట్టలు పెట్టింది. ఓ మూల గిల్టు జాకాలు, పూసల గాజులు. ఓ చిన్నిడబ్బాలో ఏభై రూపాయల చిల్లర నాణేలు.

"దుర్గీ, అక్కడ నువ్వు అల్లరి సెయ్యకు. అమ్మాయిగోర్ని సిరాకెట్టకు. సుబ్బరంగా పని సేస్కో. అమ్మగోర్కి సాయం సెయ్యి. బావుగోర్కి మాటకుమాటా సెప్పకు. వల్లకుండు. నంకురాతిరికి అమ్మాయిగోరితో కలిసిరా. మనమ్మాయి గోరే కదా నీకేం పరవానేదు. అమ్మాయిగోరు నీకు సక్కని తిండెడతారు. బట్టలిత్తారు. నీకు బేంకులో డబ్బేత్తానన్నారు. ఆర్నెల్లయితే నాకు పంపిత్తానన్నారు. ఎంత? ఆరేళ్ల .తర్వాత నీకు పెళ్లీడు వచ్చేత్తాది. అపుడే కంగా నిన్ను తెచ్చేసుకోని పెళ్లి సేయించెత్తాను. "

సామాను సర్దేసి నులక మంచం మీద కూర్చుని కూతురికి చెప్తోంది రాములమ్మ.

" అమ్మా, నానెళ్లనే. ఓలమ్మా, నాకిక్కడే బాగుంటాదే! నానెళ్లిపోతే అయ్య తాగి నిన్నుతంతాడే. ఇక్క డే ఇంకో నాలుగిళ్లలో పనికి కుదురుతానే? అమ్మా నేనెళ్లనే! భయమేత్తుందే! " తన మెడ చుట్టే స్కుని దీనంగా అంటోంది దుర్గి.

"ఏంటే దుర్గీ? అమ్మాయిగోరు లేరూ? ఎందుకే బయం? బావుగోరు కూడాసానా మంచోరు. నువ్వు మామీద బెంగెట్టుకోకు. నువ్వు డబ్బు సంపాయిత్తే మీ అయ్యకూడా నన్ను కొట్టడు" కూతుర్ని సముదయిస్తూ తనూ కళ్లొత్తుకుంది రాములమ్మ.

"ప్రియా, ఆ అమ్మాయి గురించేనే మీ అమ్మగారు చెప్పారు. చామింగ్ ఫేస్ కదూ. భలే ఏక్టివ్‌గా ఉంటుందంట. పోన్లే మనతో వస్తే నీకూ హాయిగా ఉంటుంది. మంచి కంపెనీ"

అప్పుడే వచ్చి పక్కన నిల్చుని అంటూన్న భర్తను చూసి, 'ఆఁ' అంది సుప్రియ పొడిగా.

తల్లి గుండెల మీద తలాన్చి నిశ్చింతగా నిద్రపోతున్న దుర్గి మీద వాల్తోన్న వెన్నెల వెండిల్లా మెరుస్తోంది. ఏ పీడకల ఆ పిల్లని భయపెట్టిందో, ఉలిక్కిపడి తల్లిని ఇంకా గట్టిగా కరచుకుని నెమ్మదిగా నిద్రలోకి జారుతోన్నదుర్గిని చూసి వేడిగా నిట్టూరుస్తూఅక్కణ్నించి కదిలింది సుప్రియ.

తెల్లారుజాము నాలుగ్గంటలకే స్టేషన్ వెళ్లడానికి సిద్ధమవుతున్నారంతా. సామానంతా సర్దేశారు. సుప్రియ తండ్రి కూతుర్ని పట్టుకుని ఏడ్చారు. అల్లుడి చేతిలో కూతుర్నుంచి ఇక'నీవే సర్వస్వం' అన్నట్టు చేతుల్లో మొహం దాచుకుని ఏడ్చాడు. దొంగతనంగా తనుతెచ్చిన సీమచింతకాయల్ని అక్క చేతిలో పెట్టి బావురుమన్నాడు తమ్ముడు. వర్ధని సంగతి చెప్పనక్కరలేదు.

సుప్రియ చేతులు పట్టుకుని ఏడ్చింది రాములమ్మ. "దుర్గీ, నీ పెట్టేదే" ఏడుస్తూనే అడిగింది రాములమ్మ. అక్కడే దీనంగా నించున్న దుర్గిని చూసి. అది ఒక్క క్షణం బిత్తరపోయి పెరట్లోకి పరిగెత్తింది.

"అయ్యో , మర్చిపోయాను. అమ్మాయి దార్లో తింటానికి నువ్వుజీళ్లు నీతో తెప్పించాను కదే! అవా వంటగదిలోనే ఉన్నాయి. రాములమ్మా తీసుకురావే!" అకస్మాత్తుగా గుర్తొచ్చి అంది వర్ధని.

"అమ్మా నానెళ్లనే! పెట్టె పక్కనే దీనంగా నించుని ఏడుపుని దొగమింగుకుంటూ తల్లి కొంగు పట్టుకుంది దుర్గి.

"ఎళ్లే సచ్చిన గుంటా. ఎదవేడుపూ నువ్వూనూ. నువ్వుజీళ్లు ఎక్కడున్నాయో ఏటో!" దుఃఖాన్ని దిగమింగుకుంటూ కూతుర్ని కసిరింది రాములమ్మ. ఇప్పుడు. తనేడిస్తే కూతురు వెళ్లదు. అది వెళ్లకపోతే తమకు బతుకు లేదు.

వేరే గత్యంతరం లేక నెమ్మదిగా అక్కణ్నుంచి కదిలింది తల్లి. కొంగుని వదిలి కదులల్తోన్న కూతుర్ని చూసి కుమిలిపోయింది రాములమ్మ. అంతలోనే తేరుకుంటూ కారు దగ్గరికి పరిగెత్తింది. అప్పటికే కారు వెళ్లి దుమ్ము లేచింది. ఆ దుమ్ములో రేగిన జుట్టుతో దుర్గి.

"అమ్మగారూ దుర్గి ఎళ్లనేదు. ఏటే ఎళ్లనన్నావా ఏటే? ఎందుకే నువ్వు సావకా?" కూతుర్ని గట్టిగా బాదుతూ ఉక్రోషంతో ఏడవసాగింది రాములమ్మ. దెబ్బలు తింటూ నిశ్శబ్దంగా నిల్చుంది దుర్గి. ఆ పిల్ల నోరు విప్పలేదు. కన్నీళ్లు కార్చలేదు. భావంలేని చూపుల్తో వెళ్లిపోయిన కారువంక రేగిన దుమ్ము వంకా చూస్తోంది.

"ఏటే ఏటన్నావే? మాటాడలేదు. దెయ్యం పట్టిందేటే! దాన్ని ఒగ్గిస్తానుండు" శివమెత్తింది రాములమ్మకి.

"రాములమ్మా, ఏంటిది? దాన్నెందుకలా కొడుతున్నావు? అదేం అన్లేదు. అమ్మాయి తను దాచుకున్న అయిదు వేలు దాని పేన్న బాంకులో వేసింది."

అమ్మాయిగారి గొప్ప మనసు అర్థమయ్యి దుర్గి అప్పుడు వెక్కివెక్కి ఏడ్చింది.